సింగిల్ పేజీ కథలు

చెంపదెబ్బ

విజయవాడ బస్ స్టాండ్‌లో పాస్‌ల కౌంటర్ జనంతో కిటకిటలాడుతోంది. కొత్త సినిమా మొదటి ఆటకి వున్నట్టు క్యూ చాలా పెద్దదిగా వుంది. ఆ క్యూలో నుంచుని వున్న దివాకర్ అప్రయత్నంగా జేబు తడుము కున్నాడు. ఒక్కసారిగా కంగారుపడ్డాడు. పాస్ కోసం, కాలేజీలో ఫీజు కట్టడం కోసం తెచ్చిన డబ్బు చేతికి తగలలేదు.



ఒళ్లంతా చెమటలు పట్టాయి. గబగబా పర్స్ తీసి వెతికాడు. అందులో లేవు. పుస్తకాలు వెతికాడు. వాటిలోనూ లేవు. అయినా ఎలా వుంటాయి? తను జేబులో పెట్టాడు. బాగా గుర్తు. ఒక్కసారిగా వెనక్కి తిరిగాడు. "ఏమయ్యిందిరా?" అన్నాడు ఫ్రెండ్ శ్రీనివాస్.

"డబ్బులు పోయాయిరా... పాస్ కోసం, ఫీజు కోసం పెట్టుకున్నవి."

"ఎలా పోయాయిరా" బాధగా అన్నాడు.

ఇంతలో కౌంటర్ దగ్గరకొచ్చేశాడు దివాకర్. "ఒరేయ్... ఈరోజుకి నేను పాస్ తీసుకుని, నీకు బస్సులో టికెట్ తీస్తానులే" అన్నాడు శ్రీనివాస్.

బస్సు కదిలింది. "ఒరేయ్, బస్ టికెట్ అంటే నువ్వు తీశావు. కాలేజీలో పరీక్ష ఫీజు ఎలాగరా? పైగా ఫీజు కట్టడానికి ఈరోజే లాస్ట్ డేట్"

"కంగారుపడకురా... మన కుమార్‌గాడు మంచి సౌండ్ పార్టీ. అడిగితే అయిదు నిమిషాల్లో ఎంత డబ్బయినా తెచ్చి ఇస్తాడు. డోంట్ వర్రీ.."

కాలేజీకి వెళ్లగానే కుమార్ కోసం వెతికారు ఇద్దరూ. స్కూటర్ స్టాండ్, ప్లేగ్రౌండ్, లైబ్రరీ, ఇంకా కుమార్ ఫ్రెండ్స్‌తో కలిసి తిరిగే చోట్లన్నీ వెతికారు. కనబడలేదు. దివాకర్‌కి టెన్షన్ పెరిగిపోతోంది. చివరికి కేంటీన్‌లో కనబడ్డాడు కుమార్- మిత్రబృందంతో కలిసి.

దివాకర్ విషయం చెప్పగానే "అరె... సారీ బాస్... ఇప్పుడే బిల్లు నాలుగు వందలు పే చేశాను. ఒక్క నాలుగు నిమిషాలు ముందొస్తే సరిపోయేది. కౌంటర్‌లో అరువు పెట్టి, నీకిచ్చేవాణ్ణి. ఇప్పుడు నెక్స్ట్ వీక్‌దాకా పాకెట్ మనీ ఇవ్వరు డాడీ.." అన్నాడు.

బాధగా వెనుదిరిగిన దివాకర్‌కి లెక్చరర్ లక్ష్మీపతిగారు గుర్తొచ్చారు. ఆయన లెక్చర్స్‌తో పాటు కుర్రాళ్లకి కెరీర్ ప్లానింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి విషయాన్ని చెబుతూ ఒక మిత్రుడిలా కలిసిపోతుంటాడు. ఇద్దరూ ఆయన కోసం స్టాఫ్‌రూమ్‌కి వెళ్లారు. ఆరోజు లక్ష్మీపతిగారు శెలవు పెట్టారని తెలిసింది.

లక్ష్మీపతిగారి తర్వాత అంత చనువుగా వుండే అపర్ణా మేడమ్ దగ్గరికి వెళ్లి హెల్ప్ చేయమనీ, రెండురోజుల్లో తిరిగి ఇచ్చేస్తామనీ అడిగారు. ఆమె ఇవ్వకపోగా- అంత అజాగ్రత్తగా ఎలా వుంటారయ్యా అని అయిదు నిమిషాలు క్లాసు పీకింది.

ఇంతలో బెల్ మోగింది. క్లాసు వైపు నడిచారు. "దివాకర్... ఒక్కసారి ఆగు. విషయం అంతా ప్రిన్సిపాల్‌గారికి చెప్పి, ఫీజు రేపు కట్టేట్టుగా పర్మిషన్ తీసుకుందాం" అన్నాడు.

విషయం విన్న ప్రిన్సిపాల్ నరసింహంగారు నిజంగా ఉగ్రనరసింహమే అయ్యాడు. "ఈరోజే పెనాల్టీతో ఫీజు కట్టడానికి లాస్ట్‌డేట్. ఇంకా పర్మిషన్ ఏమటి? సెప్టెంబర్‌కి రాయండి. ఒక సంవత్సరం పోతే మీకు లెక్కేమిటి? హాయిగా ఆ సంవత్సరం కూడా బలాదూర్ తిరగొచ్చు. అయినా యూనివర్శిటీకి చెప్పే అధికారం నాకు లేదు. మీరు ఐదు నిమిషాల్లో క్లాసుకి వెళ్లకపోతే అబ్సెంట్‌గా ట్రీట్ చేసి, చర్య తీసుకోవలసి వస్తుంది."

క్లాసులో కూర్చున్నారే కానీ ఇద్దరికీ ఏమీ బుర్రకెక్కడం లేదు. మధ్యాహ్నం పన్నెండు అయింది. "ఒరేయ్... ఫీజు కట్టే డేటే కాదు టైమ్ కూడా అయిపోతోంది. ఇక నేను సెప్టెంబర్‌కే..." నన్నటి కన్నీటి పొర పై మెరిసిన మెరుపు శ్రీనివాస్‌కి లేజర్ కిరణంలా గుచ్చుకుంది.

శ్రీనివాస్ ఒక్కసారిగా దివాకర్ నోట్సు తీసుకున్నాడు. పేజీ పేజీ వెతకసాగాడు. అనాసక్తిగా కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు దివాకర్.

"ఒరేయ్ దివా... ఉన్నాయిరా... ఈ నోట్సులోనే వున్నాయిరా. నడు ఆఫీసుకి... హర్రీ అప్..." అరిచాడు శ్రీనివాస్.

ఫీజు కట్టేశాక ఒక్కసారిగా శ్రీనివాస్ చేతులు పట్టుకొని కళ్లనీళ్లు తిరుగుతుండగా "శ్రీనూ... థాంక్స్‌రా... ఆ డబ్బులు నావి కాదని నాకు తెలుసు. నువ్వే ఎవరినో అడిగి నా బుక్స్‌లో పెట్టావు. నా జీవితంలో అత్యంత విలువైన ఒక సంవత్సరం కాలాన్ని కాపాడావు. నీకు కృతజ్ఞత ఎలా చెప్పుకోనురా"

ఒక్క పెట్టున చెంపదెబ్బ తిన్నట్టుంది శ్రీనివాస్‌కి. ఈసారి కన్నీళ్లు అతని వంతయ్యాయి. "క్షమించరా దివా! ఆ డబ్బులు నీవే. ఉదయం నీ జేబులోంచి నేనే తీశాను. గొప్ప కోసం సెల్‌ఫోన్ కొన్నాను కదా! దాని కార్డుకి డబ్బులు లేవు. సెల్ మెయింటెయిన్ చెయ్యకపోతే- కాలేజీలో, ఫ్రెండ్స్‌లో, ఊళ్లో ప్రెస్టేజీ దెబ్బతింటుందనుకున్నాను. ఎక్కడా డబ్బులు దొరకలేదు. ఈ వెధవ పని చేశాను. కానీ.. అది నీ కెరీర్ మీద దెబ్బకొడుతుందని ఊహించలేదు. ఆ పరిస్థితిలో నిన్ను చూసి, నాకు కనువిప్పు కలిగింది. భరించలేకపోయాను. అందుకే.. ఇలా.."

-వి.ఎల్.శకుంతల (విజయవాడ)